క్లుప్తంగా

వైభవంగా బంగారమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత బంగారమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, అడవివరం గ్రామస్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో త్రినాథరావు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో ఇక్కట్లు



గుంతలమయంగా ఇ.మర్రిపాలెం రోడ్డు

పరవాడ: ఇ.మర్రిపాలెం–పెదముషిడివాడ గ్రామాల మధ్యనున్న రోడ్డు అధ్వానంగా మారడంతో ఇరు గ్రామాల ప్రజలు నరకయాతన పడుతున్నారు. మెటల్ రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలతో రోడ్డంతా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు పడితే చాలు గుంతల్లో నీరు నిలిచిపోయి రాకపోకలకు అవరోధం ఏర్పడుతోంది. కనీసం ద్విచక్ర వాహనం కూడ రావడం కష్టంగా మారుతోంది. చీకటి పడితే ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే ప్రయాణికులు నరకం చూస్తున్నారు. రోడ్డులో కనీసం వీధి దీపాలు లేక ఇరు గ్రామాల ప్రజలు రాకపోకల సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. అధ్వానంగా మారిన మెటల్ రోడ్డును అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అభాగ్యులకు రగ్గుల పంపిణీ



రగ్గులు అందిస్తున్న అక్షయ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

పెందుర్తి: చలికాలం కావడంతో పెందుర్తిలోని అక్షయ ఆశ్రయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేశారు. పెందుర్తి నూకాలమ్మ ఆలయం నుంచి విశాఖ రైల్వేస్టేషన్ వరకు రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న సుమారు 100 మందికి శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు వీటిని అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సాదర స్వాగతం



విజయసాయిరెడ్డికి శాలువా కప్పి ఆహ్వానిస్తున్న శరగడం చిన అప్పలనాయుడు

పెందుర్తి: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డిని ఆదివారం విశాఖ విమానాశ్రయంలో పెందుర్తి ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శరగడం చిన అప్పలనాయుడు స్వాగతం పలికారు. ఆయన్ని దుశ్శాలువా కప్పి, ఆహ్వానించారు.

> 'ప్రజా ప్రతినిధులమైన మా ఫోటోలు కబ్జా స్థలాల్లో పెట్టుకుని ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఎక్కడైనా ఇలాంటి పరిస్థితి ఉంటే మా దృష్టికి ప్రజలు తీసుకురావాలి. కబ్జాదారులను ఎట్టి పరిస్థితిల్లోనూ ప్రోత్సహించబోం'
>
> – బుధవారం సుజాతనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల

> 'ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ మైనింగ్ విషయంలో మా ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుంది. ఓ రకంగా చెప్పాలంటే ప్రభుత్వ భూములకు మేం రక్షకులం. ఎవరు కబ్జాలకు పాల్పడినా తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటాం'
>
> – పెందుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల

> 'ప్రభుత్వ భూములను ఆక్రమించేది ఏ పార్టీ వారైనా ఉపేక్షించం. వాటిని కాపాడాల్సిన బాధ్యత మాకు ఎంతో ఉంది. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేస్తాం. తహసీల్దార్లు, అధికారులు భూ కబ్జాలపై కఠినంగా వ్యవహరించాలి'
>
> – శుక్రవారం పెందుర్తి రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

- కబ్జాలు, అక్రమ నిర్మాణాలతో చెలరేగిపోతున్న టీడీపీ, జనసేన నాయకులు
- చినముషిడివాడలో రూ.2 కోట్ల విలువైన స్థలాన్ని ఆక్రమించిన ఎమ్మెల్యే అనుచరుడు
- దేవస్థానం భూమిలో జీవీఎంసీ అనుమతి లేకుండా కార్పొరేటర్ అక్రమ నిర్మాణం
- సాయిమాధవ్‌నగర్‌లో ప్రజాప్రతినిధి అండతో గెడ్డ స్థలం ఆక్రమించి నిర్మాణం

'కూటమి' బరితెగింపు

దర్జాగా.. కబ్జా





వేపగుంట సాయిమాధవ్‌నగర్ సర్వే నెం.109లో గెడ్డను ఆక్రమించి ఓ ప్రజాప్రతినిధి అండతో నిర్మిస్తున్న భవనం



నాయుడుతోట(వేపగుంట) సర్వే నెం.77 దేవస్థానం భూమిలో జీవీఎంసీ



చినముషిడివాడ సర్వే నెం.109/17 ప్రభుత్వ స్థలంలో ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

పెందుర్తి: 'నోరు మాట్లాడితే.. నొసలు వెక్కిరించిన' చందంగా.. ఉంది నియోజకవర్గంలో పరిస్థితి. ఓ వైపు కబ్జాలపై ప్రజలు.. మీడియా ముందు ఎమ్మెల్యే కన్నెర్రజేస్తుండగా.. మరోవైపు ఆయన అనుచరులే ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. చాలా చోట్ల కబ్జాదారులకు కూటమి నేతలే అండదండగా ఉన్నట్లు తెలుస్తోంది. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఎమ్మెల్యే అనుచరులే దర్జాగా కబ్జా చేసి వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నా, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆక్షేపిస్తున్నారు.

ఎమ్మెల్యే అనుచరుడే కబ్జాదారు

ప్రస్తుతం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అనుచర బృందంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ వ్యక్తి చినముషిడివాడ సర్వే నెంబర్ 109/17లో 297 చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి వాణిజ్య సముదాయం నిర్మించాడు. దాదాపు రూ.2 కోట్లకు పైగా విలువైన ఈ స్థలాన్ని దర్జాగా కబ్జా చేశాడు. ప్రభుత్వ భూములను కాపాడతామని ఎమ్మెల్యే ప్రకటనలు చేస్తున్న సమయంలోనే ఈ స్థలంలో వాణిజ్య సముదాయ నిర్మాణం జరగడం విశేషం. స్వయంగా ఎమ్మెల్యే అనుచరుడు, ఓ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుడు కావడంతో రెవెన్యూ అధికారులు కూడా చేతులెత్తేశారు. ప్రభుత్వస్థలంలో నిర్మించిన ఈ దుకాణాల్లో త్వరలో ఓ షాపును మద్యం దుకాణంగా మారబోతోందని స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

జీవీఎంసీ అధికారుల అండ

నాయుడుతోట(వేపగుంట) సర్వే నెంబర్ 77లోని సింహాచలం దేవస్థానం స్థలం ఉంది. ఇందులో దాదాపు వెయ్యి గజాల్లో పెద్ద గొడౌన్ నిర్మాణాన్ని గాజువాక ప్రాంతానికి చెందిన కూటమి కార్పొరేటర్ చేపట్టాడు. దేవస్థానం ఎల్‌ఆర్‌సీ(అవి కూడా తప్పుడు పత్రాలేనని ప్రచారం)ను అడ్డం పెట్టుకుని ఈ భారీ నిర్మాణాన్ని తుది దశకు తీసుకొచ్చాడు. దీనికి జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతి లేకపోవడం గమనార్హం. నగరానికి చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యే అండతో ఈ నిర్మాణం జరిగింది. జీవీఎంసీ కార్పొరేటర్‌గా ఉన్న వ్యక్తే జీవీఎంసీ ఆదాయానికి గండి కొడుతూ ఇలా అక్రమ నిర్మాణానికి పాల్పడడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందని జనం దుమ్మెత్తిపోస్తున్నారు.

గెడ్డా.. అయినా పర్లేదు!

పెందుర్తి రెవెన్యూ పరిధి జీవీఎంసీ 93వ వార్డు నాయుడుతోట సాయిమాధవ్‌నగర్‌లో ఓ గెడ్డ ఆక్రమణకు గురైంది. కార్పొరేటర్ అండతో ఎలాంటి సెట్ బ్యాక్స్ లేకుండా, గెడ్డను ఆక్రమించి మరీ నిర్మాణం చేపట్టారు. ఇక్కడి సర్వే నెం.110లో(జిరాయితీ) నిర్మాణం చేపట్టినా పక్కనే ఉన్న సర్వే నెం.109లో గెడ్డను నిర్మాణదారుడు ఆక్రమించేశాడు. దీనికి జీవీఎంసీ నుంచి కూడా అనుమతుల్లేవు. అయితే ఇక్కడ గెడ్డ దురాక్రమణను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ, జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ఆయా నిర్మాణలపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. మా ఉన్నతాధికారులతో పాటు ఎమ్మెల్యే కూడా ప్రభుత్వ భూముల సంరక్షణపై తగిన సూచనలు ఇస్తున్నారు. మా పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణ విషయంలో కఠినంగా ఉంటాం. మా దృష్టికి వచ్చిన ఆక్రమణలను నిరోధించి, వాటిపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– ఆనంద్‌కుమార్, తహసీల్దార్, పెందుర్తి

పెరిగిన తుప్పలు.. మలుపుల్లో తిప్పలు



ముత్యాలమ్మపాలెం-తంతడి రోడ్డును కమ్ముకున్న తుప్పలు

పరవాడ: ముత్యాలమ్మపాలెం–తంతడి రహదారిలో దట్టంగా పెరిగిన తుప్పలతో ప్రయాణికులు రాకపోకలకు అవస్థలుపడుతున్నారు. ముత్యాలమ్మపాలెం నుంచి అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్ పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, మత్స్యకార్మికులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ రహదారిలో తరచూ రాకపోకలు సాగిస్తుంటారు. రహదారికి ఇరువైపుల దట్టంగా తుప్పలు పెరిగిపోవడంతో మలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గంగునాయుడుపాలెం గ్రామస్తులు ముత్యాలమ్మపాలెంలో జరుగుతున్న కూరగాయల బజారు, వివిధ పనులపై రాకపోకలకు ఇదే ప్రధాన మార్గం. రాత్రివేళ ఇళ్లకు చేరే సమయంలో రోడ్డుపై విష పురుగులు, జీవుల సంచారంతో భయభ్రాంతులకు గురవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారికి ఇరువైపుల పెరిగిన తుప్పలను తొలగించాలని పంచాయతీ అధికారులను కోరినా ప్రయోజనం కనిపించట్లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిలో పెరిగిన తుప్పలను తొలగించాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికలు



ఎన్నికైన సాగునీటి సంఘాల ప్రతినిధులు, కూటమి నేతలతో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

సబ్బవరం: మండలంలో 23 సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు పూర్తయినట్లు ఇరిగేషన్ ఏఈ సాయికిరణ్ ఆదివారం మీడియాకు తెలిపారు. ఒక్కో సాగునీటి సంఘానికి 6 ప్రాదేశిక నియోజకవర్గాలు(టీసీ) చొప్పున మండలంలో 138 టీసీలు ఉన్నాయన్నారు. వీటిలో 9 టీసీలకు ఎన్నికలు రద్దయినట్లు పేర్కొన్నారు. 5 టీసీలకు ఎన్నికలు జరగగా, మిగిలిన 124 టీసీలు ఏకగ్రీవమైనట్లు వెల్లడించారు.

అర్ధంతరంగా నిలిచిన పనులు.. విద్యార్థుల అవస్థలు



పునాదుల్లో నిలిచిన జాలరిపేట ప్రాథమిక పాఠశాల భవనం

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు జాలరిపేటకు మంజూరైన ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో పరాయి పంచన తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో ప్రైమరీ స్కూల్ నిర్మాణానికి గత ప్రభుత్వం సుమారు రూ.8 లక్షలు మంజూరు చేసింది. నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టరు భవనాన్ని పునాదుల స్థాయి వరకు తీసుకొచ్చి, వదిలేశాడు. తర్వాత ఎన్నికల నోటిఫికేషన్, ప్రభుత్వం మారడంతో పట్టించుకునే నాథుడే లేకపోయాడు. దీంతో పాఠశాలలో చదువుతున్న 30 మంది విద్యార్థులకు స్థానిక తుపాను షెల్టరే తరగతి గదిగా మారింది. తుప్పల మధ్యనున్న తుపాను షెల్టర్‌లో విషపురుగులు, పాములు సంచరిస్తుండటంతో విద్యార్థులు భయంభయంగా చదువులు సాగిస్తున్నారు. గ్రామంలో అసంపూర్తిగా వదిలేసిన పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

ధనుర్మాసోత్సవాలకు వేళాయె


- ముస్తాబైన వేంకటాద్రి
- నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు
- భోగి నాడు గోదా-రంగనాథుల కల్యాణంతో ఉత్సవాల ముగింపు



వేంకటేశ్వరస్వామి



విద్యుద్దీపాలంకరణ



రంగులు, పూల అలంకరణలో ఆలయం

పెందుర్తి: వేదాల్లో సామవేదం.. మాసాల్లో మార్గశిర మాసం అత్యంత పవిత్రమైనవని భగవద్గీత ఉవాచ. సూర్యుడు వృశ్చికరాశి నుంచి ధనూరాశిలోని ప్రవేశించే సమయమిది. అందుకే దీన్ని ధనుర్మాసంగా వ్యవహరిస్తారు. హిందువులు పవిత్రంగా ఆచరించే భగవద్గీత పుట్టింది కూడా ఈ నెలలోనే. గోదాదేవి(ఆండాళ్) రంగనాథుడిని ప్రసన్నం చేసుకునేందుకు రోజుకో రీతిన 'తిరుప్పావై'పాశురాల ను ఆలపించి, స్వామిలో ఐక్యం అయింది కూడా ఇదే మాసంలో. అంతటి పవిత్ర ధనుర్మాస ఉత్సవాలకు వేంకటాద్రిపై కొలువు దీరిన వేంకటేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. సోమవారం నుంచి ధనుర్మాస, గోదా రంగనాయకుల కల్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో నీలిమ తెలిపారు. జనవరి 13న గోదా రంగనాయకుల కల్యాణోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

- సోమవారం(16వ తేదీ) ఉదయం 6.30 గంటల నుంచి ధనుర్మాసం. దీంతో ఉదయం 5.30కు విష్వక్సేన పూజతో కార్యక్రమాలు మొదలుకానున్నాయి. 6.30కు తిరుప్పావై పారాయణం, ప్రవచనం, శాత్తుమురై, తీర్థప్రసాద వినియోగం జరగనుంది.
- 17 నుంచి రోజూ ఉదయం 4.30కు తిరుప్పావై పారాయణ, శాత్తుమురై, తీర్థప్రసాద వితరణ కొనసాగుతుంది.
- జనవరి 1న నవనీత అలంకారం
- 6న సుదర్శన హోమం, సామూహిక కుంకుమపూజలు, భక్తులకు అన్నప్రసాద వితరణ.
- 10(శుక్రవారం)న ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, గిరి ప్రదక్షిణ.
- 11న కూడారై ఉత్సవం, కూడారై పాశుర విన్నపం
- 12న తిరువీధి మహోత్సవం
- 13న భోగి పండగ, సాయంత్రం గోదారంగనాయకుల కల్యాణ మహోత్సవంతో ధనుర్మాస ఉత్సవాలు ముగియనున్నాయి.

శ్రీవైష్ణవులకు పవిత్రమాసం

భగవంతుడిని సశరీరంగా చేరేందుకు తను వ్రతాన్ని ఆచరించి, గోపికలచే ఆచరింపచేసి ఆ పరమాత్మను చేరుకున్న ధన్యశీలి గోదాదేవి(ఆండాళ్ తల్లి). సాక్షాత్తూ రంగనాథుడే స్వప్నంలో సాక్షాత్కరించడంతో, సాలంకృత కన్యగా గర్భగుడిలో ప్రవేశించి, అందరూ చూస్తుండగానే స్వామిలో ఐక్యమైనట్లు ఇతిహాసాలు చెప్తున్నాయి. అందుకే ధనుర్మాసంలో పెళ్లికాని పడుచులు మంచి భర్తని ప్రసాదించమని గోదాదేవి(ఆండాళ్)ని వేడుకుంటూ పాటలు పాడతారు. దీన్నే తిరుప్పావై వ్రతం అంటారు. శ్రీవైష్ణవులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించే వ్రతమిది. ధనుర్మాసంలో వైష్ణవాలయాలు, శ్రీవైష్ణవుల ఇళ్లలో తిరుప్పావై 30 పాశురాలను రోజుకొకటి చొప్పున పారాయణం చేసి, భక్తి శ్రద్ధలతో గోదారంగనాథులను అర్చిస్తారు. ధనుర్మాసంలో సుప్రభాతానికి బదులు అన్ని వైష్ణవాలయాల్లో తిరుప్పావై పాశురాలనే పాడతారు.

అమరజీవికి ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు



అమరజీవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పెందుర్తి శాఖా గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అమరజీవి పొట్టి శ్రీరాముల వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌వీవీ సత్యారావుతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అమరజీవి త్యాగ ఫలితంగానే తెలుగు రాష్ట్రం అవిర్భవించిందన్నారు. భారత స్వాతంత్రోద్యమంలో పొట్టి శ్రీరాముల పాత్రను అధ్యాపకులు వివరించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి బి.సూర్యకళ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 58 రోజుల నిరాహార దీక్షతో ఆత్మార్పణ చేశారని వివరించారు. కార్యక్రమంలో బాల బాలికలు, పోటీ పరీక్షల విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పెందుర్తి: పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూఅప్ చార్జీలతోపాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యంలో 97 వార్డు వీరానగర్లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జోన్ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతున్నారని ఆక్షేపించారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలు, పన్నుల భారాలతో సతమతమవుతున్న ప్రజలకు గోరుచుట్టుపై రోకలి పోటులా ట్రూఅప్ చార్జీల పేరిట రూ.18 వేల కోట్ల కరెంట్ చార్జీలు మరింత భారంగా మారాయని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్లు పెట్టి అదానికి వేల కోట్ల రూపాయల లాభం చేకూర్చేలా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ట్రూఅప్, సర్దుబాటు చార్జీలు, కరెంట్ డ్యూటీస్ ఉపసంహరించకపోతే ఆంధ్ర రాష్ట్రంలో మళ్లీ మరో విద్యుత్ పోరాటం ప్రజలందరినీ కదిలించి సిపిఎం పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమం చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో సింహాచలం అప్పారావు, శ్రీను, ఆనంద్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా లలిత, దత్త జయంతి వేడుకలు



లలితా హోమంలో పాల్గొన్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో దత్త జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్షేత్ర ముఖద్వారం వద్ద దత్తాత్రేయ మందిరంలో కొలువైన దత్తాత్రేయ స్వామి వారికి పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చన జరిపారు. అదేవిధంగా లలితా జయంతిని పురస్కరించుకుని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, దివ్య అలంకరణ, విశేష అర్చన, లలితా హవనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూఎస్ఏలోని ఇండియానా స్టేట్ నుంచి వచ్చిన ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సంజీవ్ అగర్వాల్, డాక్టర్ లక్ష్మీ అగర్వాల్ దంపతులు, యూకే నుంచి లోయల్లాతో పాటు అనేక మంది భక్తులు హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని గురుమాత అన్నపూర్ణమ్మ, రమ ప్రభాకర్, వలంటీర్లు పర్యవేక్షించారు. అమృత కన్యా గురుకులం పిల్లలకు విశాఖలోని ఎసెంట్ కళాశాలకు చెందిన రాము దంపతులు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి పంచిపెట్టారు.

అప్పన్న అన్నదానానికి విరాళాలు





దాతలు శిరీష్, పురుషోత్తం కుటుంబ సభ్యులకు అన్నప్రసాద పథకం బాండ్‌లు అందిస్తున్న దేవస్థాన సిబ్బంది

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరానికి చెందిన శిరీష్, కాళ్ల పురుషోత్తం అనే దాతలు చెరో రూ.లక్ష చొప్పున విరాళాలు అందించారు. సంబంధిత విరాళాలను సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలో నగదు రూపంలో సిబ్బందికి అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్‌లు ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.